క్లుప్తంగా

నలుగురు జూదరులు అరెస్ట్

పెదనందిపాడు: పేకాట ఆడుతున్న సమాచారం అందుకున్న ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తన సిబ్బందితో దాడి చేసి నలుగురు జూదరులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. బుధవారం సాయంత్రం ఎస్ఐ రెహమాన్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని వరగాని గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 1,730 రూపాయల నగదు, రెండు సెలఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. గ్రామాల్లో ఎక్కడైనా పేకాట, కోడి పందేలు నిర్వహిస్తున్నట్లయితే స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకునికి డాక్టరేట్


భాష్యం కృష్ణమోహన్

గుంటూరు రూరల్: నైపుణ్యత కలిగిన ప్రతి ఒక్కరి లక్ష్య సాధనకు కృషిచేయటం తమ కళాశాల లక్ష్యమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. శ్రీనివాస్ తెలిపారు. బుధవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న భాష్యం కృష్ణ మోహన్‌కు భారతీదాసన్ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. ప్రిడిక్టివ్ పారడిమాటిక్ ఆన్ కయోటిక్ ఫైనాన్షియల్ టైమ్ సిరీస్ అప్లయింగ్ డీప్ లెర్నింగ్ హైబ్రిడ్స్ అనే అంశంపై ప్రొఫెసర్ డాక్టర్ ఎమ్ దొరైరాజ్, డాక్టర్ సునీత పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకుడిని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్ తదితరులు అభినందించారు.

భూముల రీసర్వే సమస్యలకు చెక్



పొన్నూరు: గ్రామాలలో నిర్వహిస్తున్న భూముల రీసర్వే కార్యక్రమాన్ని వేగవంతంగా చేయాలని జాయింట్ కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. బుధవారం పొన్నూరు తహసీల్దార్ కార్యాలయంలో భూముల రీసర్వేపై అధికారులు సర్వేయర్లు, వీఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ రీసర్వే వలన ఎన్నో ఏళ్లుగా భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న అనేకమంది రైతులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. హద్దులు, కొలతలలో ఎలాంటి తప్పులు లేకుండా సక్రమంగా రీ సర్వే చేయాలని సూచించారు. సమావేశంలో తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, తహసీల్దార్ శ్రీకాంత్, డీటీలు, సర్వేయర్లు, పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలి

పెదకాకాని: సమాజ శ్రేయస్సుకు విద్యార్థులు కృషి చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. మండల పరిధిలోని వీవీఐటీ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు బుధవారం ఏర్పాటు చేసిన ఇండక్షన్ ప్రోగ్రాం (ప్రేరణ కార్యక్రమం)లో లక్ష్మణరావు ప్రసంగిస్తూ మన చదువు దేశానికి, సమాజానికి, ఇతరులకు సేవ చేసేందుకు ఉపయోగపడాలన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకుసాగాలన్నారు. విద్యార్థుల లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం, దాని సాధనకు ప్రణాళిక రూపొందించుకోవడానికి మొదటి సంవత్సరం ఎంతో కీలకమన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని నెరవేర్చుకోవడంతోపాటు తల్లిదండ్రుల ఆకాంక్షలు నెరవేరేలా కృషి చేయాలన్నారు. విద్యార్థులు సమాజాన్ని అధ్యయనం చేసి సమాజ శ్రేయస్సుకు కృషి చేయాలన్నారు. దేశం కోసం ఏం చేయాలనే భావనతో యువత ముందుకుసాగాలన్నారు. దేశాభివృద్ధిలో సాంకేతికత కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, అడ్మిన్ డీన్ డాక్టర్ ఎన్ కుమార స్వామి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆరోగ్య సురక్ష సర్వేలో తప్పక పాల్గొనాలి

పొన్నూరు: ఈనెల 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వైఎస్సార్ ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి ఈ నెల 15 నుంచి నిర్వహించనున్న ఇంటింటి సర్వేలో ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త తప్పక పాల్గొనాలని సీడీపీఓ వెంకటరమణ తెలిపారు. బుధవారం పట్టణంలోని సీడీపీఓ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ప్రతి ఇంటిని కార్యకర్తలు సందర్శించి రక్తహీనతతో ఉన్న తల్లులను గుర్తించి వారికి అందాల్సిన పౌష్టికాహారం, టాబ్లెట్స్ వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి నెలలో మొదటి, మూడో శుక్రవారం అందించాల్సిన మూడు కిలోల బియ్యం, 25 గుడ్లు, కిలో కందిపప్పు, అరకిలో నూనె, ఐదు లీటర్ల పాలు, వైఎస్సార్ కిట్ క్రమం తప్పకుండా పిల్లలకు, తల్లులకు అందించాలని సూచించారు. అనంతరం కార్యకర్తలు, ఆయాలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఒక్కొక్కరికి నాలుగు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చేబ్రోలు, పెదకాకాని, పొన్నూరు మండలాల సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమం అభివృద్ధే జగనన్న ధ్యేయం

- పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య
- నారాకోడూరులో గడప గడపకు మన ప్రభుత్వం


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బుక్‌లెట్‌ను అందజేస్తున్న పొన్నూరు ఎమ్మెల్యే కిలారి

నారాకోడూరు(చేబ్రోలు): సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తూ, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్నారని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. సంక్షేమ పథకాలతో అక్కచెల్లెమ్మలు, అవ్వా తాతలు, రైతన్నలకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యల సహకారం మరువలేనిదని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ సచివాలయం-1 పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నారాకోడూరులోని గుండవరం రోడ్డు, జీబీసీ రహదారి, యాదవపాలెం ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తూ, సమస్యలను తెలుసుకుంటూ బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అందించిన సంక్షేమం, అభివృద్ధి గురించి తెలియజేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామని, జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామ సభలో కిలారి మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో 95 శాతంకు పైగా పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రజలకు అందించే ప్రతి సంక్షేమ పథకాన్ని వారి ఇంటి ముంగిటకే వచ్చి అందిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా అందిస్తున్నట్లు తెలిపారు. వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకు పరిపాలన తీసుకువచ్చినట్లు తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, గ్రామ సచివాలయాలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. గుండవరం రోడ్డులో కొత్తగా మంజూరైన వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారునికి నగదు, బుక్‌లెట్‌ను అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి మెరుగైన వైద్యం అందించటం కోసం వైఎస్సార్ ఆరోగ్య మిత్రకు పలు సూచనలు చేశారు. సిమెంటు రహదారులు, డ్రైన్లు అభివృద్ధి చేయాలని స్థానికులు కోరటంతో ఇంజినీరింగ్ అధికారులకు ఎస్టిమేట్లు వేయాలని తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన కొన్ని సమస్యలను ఎమ్మెల్యే అక్కడికక్కడే పరిష్కరించారు. మండల, గ్రామ అధికారులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, డి.రత్నరాజు, కోడూరి కోటేశ్వరరావు, పి.నరేష్, వెలగా కృష్ణ, దానబోయిన శ్రీనివాసరావు, రామయ్య, జోజిబాబు, సాంబయ్య, స్థానిక పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.


లబ్ధిదారుకు వైఎస్సార్ పెన్షన్ కానుక నగదు, బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కిలారి

పత్తి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతు శిక్షణ సదస్సు

గుంటూరు రూరల్: పత్తి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి పంటను కాపాడుకోవచ్చని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం విస్తరణ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఓ శారద తెలిపారు. బుధవారం లాంఫాం దత్తత గ్రామం నిడుముక్కలలో పత్తి పంటల్లో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతు శిక్షణ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలో ముఖ్య పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువుల యాజమాన్యాన్ని వివరించారు. శరీరధర్మశాస్త్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జయలలిత మాట్లాడుతూ పత్తి పంటలో సూక్ష్మ పోషకాల లోపాలు వాటి లక్షణాలు, నివారణ చర్యలు వివరించారు. కీటకశాస్త్రం శాస్త్రవేత్త డాక్టర్ డయానగ్రేస్ మాట్లాడుతూ పత్తి పంటలో రసం పీల్చే పురుగులు, గులాబిరంగు పురుగుల యాజమాన్యం నివారణ చర్యలు వివరించారు. వృక్షవ్యాధిశాస్త్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీలక్ష్మి మాట్లాడుతూ పత్తి పంటలో వచ్చే వివిధ రకాల తెగుళ్ళు వాటి నివారణ చర్యలను తెలిపారు. చిరుధాన్యాల ప్రాధాన్యతను, పౌష్టికాహారం ప్రాధాన్యతను కమ్యూనిటీ కళాశాల విద్యార్థులు వివరించారు. అనంతరం రైతులకు లింగాకర్షక బుట్టలను అందజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి నరసింహారావు, రైతులు తదితరులున్నారు.

పదిమందికి మించి ఉన్న ఓటర్లను తనిఖీ చేయాలి

పొన్నూరు: పొన్నూరు నియోజకవర్గంలో ఒకే డోర్ నంబర్లో పది మందికి మించి ఉన్న ఓటర్లను తనిఖీ చేయాలని పొన్నూరు అసెంబ్లీ ఈఆర్‌ఓ హరిహర నాథ్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నియోజకవర్గ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 100 సంవత్సరాల వయస్సు దాటిన ఓటర్ల వివరాలు, క్లైముల సత్వర పరిష్కారం తదితర విషయాలపై ఆయన వివరించారు. కార్యక్రమంలో పెదకాకాని, చేబ్రోలు, పొన్నూరు తహసీల్దార్లు పి. రత్నం, గోపాలకృష్ణ, ఎస్. శ్రీకాంత్, పొన్నూరు ఎంపీడీవో ఏ. శ్రీనివాసరావు, టీపీఓ సాంబయ్య, డిప్యూటీ తహసీల్దార్లు ఫణి కుమార్, ప్రణతి, సీనియర్ అసిస్టెంట్లు ఆనందరావు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలి


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో శైలజ

పెదనందిపాడు: బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి వారిని పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా విద్యా శాఖ అధికారి శైలజ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం సాయంత్రం పెదనందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో శైలజ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ నాడు-నేడు కింద శాంక్షన్ అయిన నిధులను వాటి కోసమే వినియోగించాలని, నిధులను దుర్వినియోగం చేస్తే వాటికి పాఠశాల ప్రధానోపాధ్యాయలే భాధ్యత వహించాల్సి వస్తుందని చెప్పారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతపై ఆరా తీశారు. ఆమె వెంట కోఆర్డినేటర్ విజయలక్ష్మీ, జిల్లా కోఆర్డినేటర్ రవి, ఎంఈవోలు ఉన్నారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న శ్రీనివాసరావు


గణిత ఉపాధ్యాయుడును సన్మానిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు తదితరులు

చేబ్రోలు: ఉపాధ్యాయ వృత్తిలో ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శ్రీనివాసరావు అందరికీ ఆదర్శనీయులని చేబ్రోలు ఎంఈవో-1 ఆర్ సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని నారాకోడూరు జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం గణిత ఉపాధ్యాయుడు శ్రీనివాసరావుకు అభినందన సభ జరిగింది. స్థానిక హైస్కూల్ హెచ్‌ఎం ఎం.ఏడుకొండలు అధ్యక్షత వహించారు. ఎంఈవో-2 ఏహెచ్‌ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ నిబద్ధత, అంకిత భావంతో విద్యాబోధన అందిస్తున్న శ్రీనివాసరావు అందరి ప్రశంసలు పొందుతున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తితో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందినట్లు తెలిపారు. గణిత ఉపాధ్యాయుడిని పలువురు మెమెంటోలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులు నూటికో -కోటికో ఒక్కడు నృత్యం ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు చలపతిరావు, శివప్రియ పాల్గొన్నారు.

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించాలి

చేబ్రోలు: మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారంను అందించాలని చేబ్రోలు తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల, సుద్దపల్లి దళితవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకంను బుధవారం తహసీల్దారు పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన..

మండల పరిధిలోని పాతరెడ్డిపాలెం, శేకూరు, శలపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. పాతరెడ్డిపాలెం గ్రామ పరిధిలోని పోలింగ్ కేంద్రం శిథిలావస్థకు చేరినట్లు గుర్తించారు. విద్యుత్, తాగునీరు, ర్యాంప్, మౌలిక వసతుల కల్పన కోసం సిబ్బందికి పలు సూచనలు చేశారు. మిగిలిన ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి నివేదికను రూపొందించారు. తహసీల్దారు వెంట స్థానిక వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు డిజిటల్ విధానంపై అవగాహన సదస్సు


కార్యక్రమంలో పాల్గొన్న క్షేత్రస్థాయి అధికారులు

గుంటూరు రూరల్: రైతులకు ఎదురయ్యే సమస్యలకు డిజిటల్ విధానంలో సమాచారం అందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయటం ఈ కార్యక్రమం ఉద్దేశమని ఆత్మ పీడీ రామాంజనేయులు తెలిపారు. బుధవారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో డిజిటల్ గ్రీన్ సంస్థ, భారత వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అమలవుతున్న విస్తార్ ప్రాజెక్ట్‌లో భాగంగా డేటా డెస్టినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ విస్తరణ కార్యకర్తలు, వారి అనుభవాలను తెలుసుకునేందుకు హార్టికల్చర్, అగ్రికల్చర్, ప్రకృతి వ్యవసాయం, సెర్ప్, వ్యవసాయ శాఖల్లో పనిచేసే క్షేత్రస్థాయి కార్యకర్తలు, అధికారులతో సమావేశం నిర్వహించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు ఎటువంటి సమాచారం కోరుతున్నారు, ఏఏ సేవలు అవసరం, ఏఏ వేదికలపై రైతులు ఎక్కువగా చర్చిస్తున్నారు, రైతులకు సులభంగా సమాచారం ఎలా చేర్చాలి, రైతులు వారంతట వారే సులభంగా సమాచారం తెలుసుకునేందుకు ఎటువంటి వ్యవస్థలను అభివృద్ధి చేయాలి, అనే విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం గురవయ్య బృందం, వంగా నవీన్‌రెడిడ సెర్ప్ ఏపీఎమ్‌లు, హెచ్వోలు, సీసీలు, వీఏఏలు, డిజిటల్ గ్రీన్ సంస్థ నుంచి కమలాకర్, మస్తాన్, అమిత్, అనుష్క, ఎన్‌ఎఫ్‌ఏ బృందం జాన్సి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థిని సుశీలకు పీహెచ్‌డీ


ఆళ్ల సుశీల, విజ్ఞాన్ యూనివర్సిటీ

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థిని ఆళ్ల సుశీలకు తమ యూనివర్సిటీ సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. ''పెర్ఫార్మెన్స్ అవాల్యూషన్ ఆన్ యుటిలైజేషన్ ఆఫ్ స్నెయిల్ షెల్ పౌడర్ సిమెంట్ కాంపోసిట్ ఇన్ డిటీరియోరేటెడ్ స్ట్రక్చర్స్'' అనే అంశంపై ఆమె పరిశోధన చేసిందని తెలిపారు. డాక్టరేట్ పొందిన సుశీలను పలువురు అభినందించారు.

దూరవిద్య ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల

దరఖాస్తులకు ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో దూరవిద్య ద్వారా ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దూరవిద్య కోర్సుల ద్వారా రైతులు, యువతకు నైపుణ్యతను కల్పించి వారికి స్వయం ఉపాధి లక్ష్యంగా కోర్సులను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఇప్పటికే నాలుగేళ్ళలో 4 వేల మంది విద్యార్థులు రైతులు, మహిళలు ఈ కోర్సులలో శిక్షణ పొందటం జరిగిందన్నారు. ఆన్‌లైన్ కోర్సులతోపాటు ప్రతి కోర్సులో ఒక ప్రయోగ కార్యక్రమం నిర్వహిస్తారని ప్రాక్టికల్ క్లాసులను ఒకరోజు స్టడీ సెంటర్‌లలో మాత్రమే నిర్వహిస్తారన్నారు. నవంబర్ నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభం కానున్న కోర్సులు చిరుధాన్యాలు, పట్టుపురుగుల పెంపకం, వర్మికంపోస్ట్, బయో ఫెర్టిలైజర్స్ తదితర కోర్సులు 8 వారాలు (రెండునెలలు) వ్యవధిలో నిర్వహిస్తారన్నారు. ఒక్కొక్క కోర్సుకు రూ.1500 ఫీజు చెల్లించి కోర్సుకు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్ సదుపాయం కోసం నెట్ సౌకర్యం కలిగిన సెల్‌ఫోన్, కంప్యూటర్, ట్యాబ్, ఐపాడ్ వంటివి కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు అక్టోబర్ 20వ తేదీలోగా తమ పేర్లను నమదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్‌ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను గానీ 8008788776, 8309626619, 9110562727 సెల్ నంబర్లను ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ మాత్రమే సంప్రదించాలన్నారు.

వినాయక మండపాలకు పోలీస్ అనుమతి తప్పనిసరి

పెదకాకాని: వినాయక చవితి పండుగ సందర్భంగా మండల పరిధిలో మండపాలు ఏర్పాటు చేయడానికి పోలీస్ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని పెదకాకాని సీఐ బండారు సురేష్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. వినాయక నిమజ్జనం రోజు, వినాయకుని తీసుకువెళ్లే మార్గము, నిమజ్జన ప్రదేశము ముందుగా పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. అనుమతి కొరకు దరఖాస్తు చేసుకునేటప్పుడు కమిటీ సభ్యుల యొక్క గుర్తింపు కార్డులు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్ నందు సబ్మిట్ చేయాలని, విగ్రహం పెట్టే సమయంలో ఆ స్థలం ప్రైవేటు వ్యక్తులది అయితే వారి పర్మిషన్ తీసుకోవాలని సూచించారు. పెదకాకాని మండలంలో ఎక్కడైనా వినాయక విగ్రహం పెట్టాలనుకునేవారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించి మైక్ పర్మిషన్ తీసుకోవాలని సూచించారు. విగ్రహం ఏర్పాటు చేసిన తరువాత ఆ విగ్రహ నిర్వహణలో విగ్రహ కమిటీ మెంబర్ల వివరాలు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. విగ్రహాలకు విద్యుత్ సరఫరా విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. ఫైర్, విద్యుత్తు శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. మండపాల వద్ద నీళ్ళను ఇసుకను ఏర్పాటు చేయాలి.పండుగ రోజు నుంచి నిమజ్జనం వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతియుత వాతావరణంలో ప్రజలందరూ వినాయక చవితి పండుగను జరుపుకోవాలని సూచించారు.

పెదకాకాని ఎంపీడీవోగా రామకృష్ణ

ఏఎన్‌యూ: పెదకాకాని మండల అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)గా ఎ.రామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పిడుగురాళ్ల మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ ఉద్యోగ ఉన్నతి పొంది ఎంపీడీవోగా రామకృష్ణ పెదకాకాని వచ్చారు. . ప్రస్తుతం ఇన్చార్జ్ ఎంపీడీవో గా పనిచేస్తున్న బి వి మల్లేశ్వరరావు నూతన ఎంపీడీవోగా బదిలీపై వచ్చిన రామకృష్ణకు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవోను ఎంపీపీ తుళ్ళిమిల్లి శ్రీనివాసరావును కలిసి అభినందనలు తెలియజేశారు. పెదకాకాని మండలంలో అన్ని శాఖల అధికారులను సమన్వయపరిచి అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని వారు తెలిపారు.

విజ్ఞాన్ వ్యాయామ అధ్యాపకునికి లెఫ్టినెంట్ హోదా

గుంటూరు రూరల్: వ్యాయామ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న తమ కళాశాల అధ్యాపకునికి లెఫ్టినెంట్ హోదా రావటం సంతోషకరమని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనూరాధ తెలిపారు. బుధవారం పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో మాట్లాడుతూ తమ కళాశాలలో వ్యాయామ అధ్యాపకుడుగా పనిచేస్తున్న కుర్రా హరికృష్ణకు ఎన్‌సీసీలో లెఫ్టినెంట్ హోదా లభించిందన్నారు. హరికృష్ణ మహారాష్ట్రలోని నాగపూర్‌లోని కప్టిలో ఎన్‌సీసీ ఆఫీసర్‌గా ట్రైనింగ్ అకాడమీలో 3 నెలల పాటు శిక్షణ పొందారన్నారు. శిక్షణలో ఉత్తీర్ణత పొంది లెఫ్టినెంట్ హోదా సాధించారన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య హరికృష్ణను అభినందించారు.

వరి, పత్తి, మిరపలో క్షేత్రస్థాయి పరిశీలన


రైతులతో ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: పంటల్లో చీటపీడల నివారణకు నూతన రకం శిలీంద్రనాశినులతో చర్యలు చేపట్టాలని లాంఫాం ఏరువాక కేంద్రం సస్యరక్షణ ముఖ్య శాస్త్రవేత్త డాక్టర్ ఎమ్ నగేష్ తెలిపారు. బుధవారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో పత్తి, మిరప, వరి పంటల్లో క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమాన్ని రైతు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటల్లో ఆకుమచ్చ తెగులు నివారణ చర్యలు వివరించారు. ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రొపినెబ్, క్రిషక్షి మీథైల్ అనే నూతన రకం శిలీంద్రనాశినులను పరిశీలించటం జరిగిందన్నారు. వరిలో సమగ్ర సస్యరక్షణలో భాగంగా ట్రైకోగాయా గుడ్లు తినే పురుగులు, బవేరియా అనే జీవ శిలీంద్రనాశినులను ఆకుముడత, సుడిదోమ నివారణకు పరిశీలిస్తున్నామన్నారు. మిరపలో నల్ల తామర నివారణకు బ్లూ రంగు అట్టలు వేపమందు బవేరియా, వర్టిసెల్లంలఖనియా అనే జీవ శిలీంద్రనాశినులను పరిశీలిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జి.కిషోర్‌బాబు, వంగా నవీన్‌రెడ్డి, రైతులు తదితరులున్నారు.

గ్రామాల్లో సమస్యలపై సమాచారం ఇవ్వండి

గుంటూరు రూరల్: గ్రామాల్లో ఎటువంటి సమస్యలున్నా వెంటనే అధికారులకు సమాచారం అందించి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని గుంటూరు రూరల్ మండలం ఎంపీడీవో ఆదినారాయణరావు తెలిపారు. బుధవారం మండలంలోని లాలుపురం గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం, సచివాలయాన్ని పరిశీలించారు. అక్కడ సిబ్బందితో మాట్లాడారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, సమయపాలన పాటించి గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సచివాలయ సిబ్బంది ప్రతిరోజు యూనిఫాం ధరించి విధులకు హాజరు కావాలన్నారు. దుస్తులు ధరించని వారిపై శాఖపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సమస్య ఏది ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి వివరించారు. తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి చేరే విధంగా చర్యలు తీసుకోవాలని వివరించారు. ఆయన వాటర్ ఫిల్టర్‌లను పరిశీలించారు. ప్రతిరోజు శుద్ధి చేసే నీటిని బ్లీచింగ్ కలిపి సరఫరా చేయాలని ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి విధిగా ట్యాంకులు శుభ్రం చేయాలన్నారు. గ్రామ పంచాయతీ గురించి పీఓపీఆర్‌డీ ఆయనకు వివరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ల పంపిణీతో లబ్ధిదారుల్లో ఆనందం


లబ్ధిదారులతో సర్పంచ్ మొవ్వా శ్రీదేవి

పెదనందిపాడు: ప్రభుత్వం విడుదల చేసిన రెండవ విడత పెన్షన్ల పంపిణీలో పింఛను నగదు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం మధ్యాహ్నం మండల పరిధిలోని రావిపాడు గ్రామంలో కొత్తగా ఎంపికయిన లబ్ధిదారులకు పెన్షన్లను సర్పంచ్ మొవ్వా శ్రీదేవి అందజేశారు. ఈ సందర్భంగా పెన్షన్లు అందుకున్న లబ్ధిదారులు థాంక్యూ సీఎం జగనన్న అంటూ సంతోషాన్ని వెలిబుచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత కులం,మతం, పార్టీ చూడకుండా పెన్షన్లు ఇస్తున్నారని, మా గ్రామంలో ఉన్న టీడీపీ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు విక్రయాల సుబ్బారావుకు కూడా నూతనంగా పెన్షన్ మంజూరు అయినట్లు ఆమె తెలిపారు. కొప్పర్రు గ్రామంలో కొత్తగా పలువురు లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాతులూరి సురేష్, ఉపసర్పంచ్ యేలూరి శ్రీకాంత్, ఆయా గ్రామాల సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మామిళ్ళపల్లిలో నూతన పింఛన్లు

పొన్నూరు: మండలంలోని మామిళ్ళపల్లి గ్రామ సచివాలయంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ జాలాది యానాదిరావు పాల్గొని 19 మంది లబ్ధిదారులకు పింఛన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో గ్రామానికి 33 పింఛన్లు మంజూరు కాగా రెండో విడతలో 19 మందికి మంజూరయ్యాయని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.